ప్రజాశక్తి
శుక్రవారం 12 జనవరి 2024





కోలాటం ఆడుతున్న అంగన్వాడీలు, నాయకులు

కర్నూలు ఎంపీ అభ్యర్థిగా గుమ్మనూరు

- ఆలూరు సమన్వయకర్తగా విరుపాక్షి - కోడుమూరుకు డాక్టర్ సతీష్ - వైసిపి మూడో జాబితా విడుదల



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వైసిపి సమన్వయకర్తల మూడో జాబితాను ఆ పార్టీ అధిష్టానం గురువారం రాత్రి విడుదల చేసింది. వైసిపి తరపున రాబోయే ఎన్నికల్లో కర్నూలు ఎంపీ స్థానానికి, ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాలకు పోటీ చేసే అభ్యర్థులను అధిష్టానం ఖరారు చేసింది. వాస్తవానికి వైసిపి తరఫున సమన్వయకర్తల మూడో జాబితా బుధవారం సాయంత్రానికే విడుదల చేయాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల జాబితా ప్రకటన వాయిదా వేశారు. ఆ జాబితాను గురువారం రాత్రి విడుదల చేసింది.

కర్నూలు ఎంపీ అభ్యర్థిగా ప్రస్తుత రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ పేరును ఖరారు చేసింది. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా బీసీలకే కేటాయించాలని అధిష్టానం నిర్ణయించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మరో వైపు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు నియోజకవర్గాల సమన్వయకర్తలను కూడా మార్పు చేయాలని వైసిపి అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు పలువురు నాయకులతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్చలు జరిపారు. కర్నూలు ఎంపీ అభ్యర్థిగా గుమ్మనూరు జయరామ్‌కు అవకాశం ఇవ్వనున్న నేపథ్యంలో ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షి పేరును ఖరారు చేసింది. కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ సతీష్‌ను నియమించింది. తనకు మొండి చేయి చూపడంతో ఇప్పటికే కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ ఎంపీ పదవికి, వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.

నంద్యాల ఎంపీ అభ్యర్థిగా అలీ..?

నంద్యాల పార్లమెంట్ పరిధిలో ముస్లిం, మైనార్టీలు ఎక్కువగా ఉండడంతో ఆ స్థానాన్ని ముస్లింలకే ఇవ్వాలని వైసిపి అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నంద్యాల వైసిపి ఎంపీ అభ్యర్థిగా సినీ నటుడు అలీ పేరును అధిష్టానం ఖరారు చేయనున్నట్లు తెలిసింది.

నందికొట్కూరు సమన్వయకర్త మార్పు..?

జిల్లాలో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలైన నందికొట్కూరు సమన్వయకర్తను మార్పు చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం నందికొట్కూరు ఎమ్మెల్యేగా ఉన్న తోగూరు ఆర్థర్ స్థానంలో ఇతరులను నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమించి వారికి ఎమ్మెల్యే అభ్యర్థులుగా అవకాశం ఇవ్వనున్నట్లు తెలిసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న రెండు స్థానాల్లో ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి జగన్మోహన్ రెడ్డి మొండిచేయి చూపనున్నట్లు సమాచారం. ఈ అంశంపై ఇప్పటికే ఆర్థర్, సుధాకర్‌తో పాటు నందికొట్కూరు అభ్యర్థి అంశంపై శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డితోనూ, కోడుమూరు అభ్యర్థి అంశంపై కుడా ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డితోనూ ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పలు దఫాలుగా చర్చలు జరిపినట్లు తెలిసింది. నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్తగా గంగాధర్ పేరును అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. తమకు అవకాశం ఇవ్వలేమని అధినేత తేల్చి చెప్పడంతో ఆర్థర్, సుధాకర్ ఇద్దరూ తమ భవిష్యత్తు కార్యాచరణ గురించి సంశయంలో పడినట్లు తెలిసింది.

నోటీసులకు భయపడం

- సమ్మె మరింత ఉధృతం చేస్తాం
- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ
- 31వ రోజు అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

నోటీసులకు భయపడేది లేదని, సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 31వ రోజుకు చేరింది. నగరంలోని ధర్నా చౌక్ వద్ద జరిగిన 24 గంటల దీక్షల్లో ఆదోని నుంచి కర్నూలు నగరానికి 24 గంటల దీక్షలో పాల్గొనడానికి వచ్చిన అంగన్వాడీలు తరలివచ్చారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ, అధ్యక్షులు రేణుకమ్మ, చౌడేశ్వరి, మంజుల, సిఐటియు జిల్లా నాయకులు ఎం.గోపాల్, నగర ఉపాధ్యక్షులు మహ్మద్ రఫీ, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా అంగన్వాడీలపై ఇంత నిర్బంధాన్ని ప్రయోగించలేదని తెలిపారు. గతంలో 10 నుంచి 12 రోజుల్లోపు ప్రభుత్వాలు సమ్మెను శాంతియుతంగా చర్చల ద్వారా ముగించేవని చెప్పారు. అక్కాచెల్లెమ్మల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎంఎస్‌కెల ద్వారా అంగన్వాడీ కేంద్రాలను నడపడం అసాధ్యమని, ఎంఎస్‌కెలు, వాలంటీర్లు అంగన్వాడీలకు సమానంగా పని చేయలేరని తెలిపారు. కేంద్రాల్లో ఉన్న అసౌకర్యాలను ఎవరూ భరించలేరని, ఇదే అంగన్వాడీలకున్న ప్రత్యేకత అని చెప్పారు. అంగన్వాడీలు కె.వెంకటమ్మ, సోమక్క, సోమేశ్వరి, తారాబీ, ఉషా, వెంకమ్మ, కరుణమ్మ, ఎల్లమ్మ, సెక్టార్ నుంచి ఎల్లమ్మ, కల్యాణి, భారతి, గిడ్డమ్మ, రంగమ్మ, శిరీష, లక్ష్మి, నాగమణి, పద్మ, భార్గవి, సునీత, సువర్ణ, విజయ కుమారి, లక్ష్మీదేవి, రమాదేవి, నాగమ్మ, అప్పమ్మ, రామలక్ష్మి, కృష్ణవేణి, సావిత్రిలు 24 గంటల దీక్షలకు హాజరయ్యారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తెలంగాణ రాష్ట్రం కంటే అదనంగా రూ.వెయ్యి ఇచ్చి, గ్రాట్యుటీ ఇవ్వాలని కోరారు. సమ్మె శిబిరం వద్ద సిఐటియు జిల్లా నాయకులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.నిర్మల ఆధ్వర్యంలో కోలాట నృత్యాలు చేసి సమ్మె శిబిరాన్ని ఉత్సాహపరిచారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె విరమణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మెను విరమిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా జెఎసి నేతలు వెల్లడించారు. గురువారం సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్‌ను, డిఇఒ డాక్టర్ వి.రంగారెడ్డిని సమగ్ర శిక్ష అభియాన్ జెఎసి నేతలు కలిసి సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా గౌరవాధ్యక్షులు జె.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు రాజు, జిల్లా నాయకులు జగదీష్, ఆలూరు ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు రఫీ, ఇన్‌ఛార్జీ రమణ, కెజిబివి జిల్లా నాయకులు నాగరత్నమ్మ, రాజారావు, వెంకట్ రాముడు, వీరశేఖర్, లక్ష్మీనారాయణ, మధు, తులసి రెడ్డి, డి.వెంకట్ రాముడు, కెపి.చిన్న మాదన్న, నాగరాజు, రామయ్య మాట్లాడారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న 11 విభాగాలకు చెందిన ఉద్యోగుల వేతనాల పెంపుతో పాటు హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొందని తెలిపారు. ఉద్యోగులకు ఇపిఎఫ్ అమలుతో పాటు సమ్మె కాలానికి వేతనాల చెల్లింపు కూడా చేస్తున్నట్లు ప్రభుత్వం చర్చల్లో హామీ ఇచ్చిందన్నారు. మినిమం టైం స్కేల్ కింద వేతనాలు కూడా చెల్లించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. తొలగించిన పిజిటి తెలుగు, ఇంగ్లీష్ తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారానికి జరిగిన సమ్మెలో మద్దతు ఇచ్చిన రాజకీయ పార్టీలు, అఖిలపక్ష, ప్రజాసంఘాలకు అభినందనలు తెలిపారు.

పోరాటానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు

కర్నూలు కార్పొరేషన్ : ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మెకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులు జె.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు రాజు, జిల్లా నాయకులు జగదీష్, ఆలూరు ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు రఫీ, ఇన్‌ఛార్జీ రమణ, కెజిబివి జిల్లా నాయకులు నాగరత్నమ్మ, రాజారావు, వెంకట్ రాముడు, వీరశేఖర్, లక్ష్మీనారాయణ, మధు, తులసి రెడ్డి, డి.వెంకట్ రాముడు, కెపి.చిన్న మాదన్న, నాగరాజు, రామయ్య మాట్లాడారు. ఎపి సమగ్ర శిక్ష ఉద్యోగులు 22 రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె కొనసాగించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 10న చర్చలు జరిపిందని, చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమించినట్లు చెప్పారు.



ఎస్ఎస్ఎ ఎపిసి వేణుగోపాల్‌కు అభినందనలు తెలియజేస్తున్న జెఎసి నేతలు



చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, మేయర్

జగనన్న తోడు కింద 14,586 మందికి లబ్ధి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో జగనన్న తోడు కింద 14,586 మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూరిందని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. గురువారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి జగనన్న తోడు 8వ విడత కార్యక్రమానికి సంబంధించిన నిధుల విడుదలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కర్నూలు కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ డాక్టర్ సృజన, ఎమ్మెల్యేలు సుధాకర్, హాఫీజ్ ఖాన్, నగర మేయర్ బివై.రామయ్య, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, డిసిఎంఎస్ ఛైర్మన్ శిరోమణి మద్దయ్య, డిఆర్‌డిఎ పీడీ సలీం బాషా, మెప్మా పీడీ నాగ శివలీల, డిఎల్‌డిఒ బాలకృష్ణ ప్రత్యక్షంగా వీక్షించారు. జగనన్న తోడు 8వ విడత పథకం ద్వారా లబ్ధి పొందిన 14,586 మంది లబ్ధిదారులకు రూ.29.92 లక్షలు జమ అయ్యాయని తెలిపారు. జగనన్న తోడు పథకం ద్వారా రుణాలు పొంది సకాలంలో వడ్డీ చెల్లించిన 19,645 మంది లబ్ధిదారులకు రూ.20.78 కోట్ల వడ్డీని రీయింబర్స్‌మెంట్ ద్వారా జమ చేసినట్లు చెప్పారు. అందుకు సంబంధించిన మెగా చెక్కును కలెక్టర్, ఎమ్మెల్యేలు, మేయర్, అధికారులు లబ్ధిదారులకు అందజేశారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి...

- అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి - అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే శుక్రవారం చేపట్టే కలెక్టరేట్ ముట్టడిలో ప్రజలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వక్తలు కోరారు. గురువారం కర్నూలు నగరంలోని సుందరయ్య భవన్‌లో అంగన్వాడీల పోరాటానికి మద్దతుగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, జిల్లా నాయకులు పి.నిర్మల, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఎస్‌యుసిఐ నాయకులు నాగన్న, టిడిపి నాయకులు రామకృష్ణ మాట్లాడారు. వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని అంగన్వాడీలు 31 రోజుల నుంచి సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఈ సమ్మెకు మద్దతుగా అన్ని రాజకీయ పార్టీలు కలిసి శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నట్లు చెప్పారు. 31 రోజుల నుంచి అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని విమర్శించారు. అంగన్వాడీలకు జీతాలు పెంచితే రాష్ట్ర ప్రభుత్వానికి కేవలం రూ.350 కోట్లు మాత్రమే భారం పడుతుందని, ప్రభుత్వం పెట్టే ఖర్చులో అది నామమాత్రపు ఖర్చు అని తెలిపారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోగా కార్మికులను రెచ్చగొట్టే పద్ధతిలో వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించారు. ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరించడం, బలవంతంగా కొంతమందిని విధుల్లోకి చేరేలా ఒత్తిడి చేయడం, పోలీసులు, సచివాలయ ఉద్యోగుల ద్వారా అంగన్వాడీ కేంద్రాలను తెరవడం సరైన పద్ధతి కాదన్నారు. అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాల బెదిరింపులకు పాల్పడినా వారు దిగి రాకపోవడంతో ఎస్మా చట్టాన్ని ప్రయోగించి లొంగదీసుకోవాలనే ప్రభుత్వ ఆలోచన సరైంది కాదని మండిపడ్డారు. ఎస్మా చట్టం ఎవరిపై ప్రయోగించాలో తెలియని వాళ్లు రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్నారని విమర్శించారు. అంగన్వాడీలు అత్యవసర సేవలకు కిందకు ఎలా వస్తారని ప్రశ్నించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించామని, కేవలం కార్మిక సంఘాల బలవంతంతోనే సమ్మె నడుస్తోందని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి అబద్ధాలు చెప్పడం ఆయన అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం భేషజాలకు పోకుండా అంగన్వాడీ యూనియన్ నాయకులతో చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. ఇప్పటివరకు అంగన్వాడీలు చేస్తున్న పోరాటానికి రాజకీయ పార్టీలు పరోక్షంగా మద్దతు ఇస్తూ వచ్చాయని, ప్రభుత్వం దిగి రాకపోతే ప్రత్యక్ష పోరాటాలకు దిగాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. అందులో భాగంగానే నేడు అన్ని రాజకీయ పార్టీలూ కలిసి కలెక్టరేట్ ముట్టడిని చేపట్టామని తెలిపారు. సిపిఎం నగర కార్యదర్శులు ఎం.రాజశేఖర్, టి.రాముడు, కాంగ్రెస్ నాయకులు దేవకుమార్, బీఎస్పీ నాయకులు అరుణ్ కుమార్, మౌలాలి, జనసేన జిల్లా నాయకులు హసీనా బేగం, సుమలత, పద్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయి



నారా లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరిన డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, కె.పద్మ లతారెడ్డి, కె.అశోక్ వర్ధన్ రెడ్డిలు

టిడిపిలోకి 17వ వార్డు కార్పొరేటర్ కైప పద్మలత రెడ్డి

- విద్యావేత్తలు డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, కె.అశోక్ వర్ధన్ రెడ్డిలు చేరిక

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : కర్నూలు నియోజకవర్గానికి చెందిన వైసిపి నేతలు కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, కర్నూలు నగర 17వ వార్డు కార్పొరేటర్ పద్మలత రెడ్డి, అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ ఛైర్మన్ కె.అశోకవర్ధన్ రెడ్డిలు గురువారం ఉండవల్లిలో నారా లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. కార్పొరేటర్ కైప పద్మాలతరెడ్డి, కెవి సుబ్బారెడ్డి, కైప అశోక్ కుమార్ రెడ్డిలు వైసీపీకి రాజీనామా చేసి టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వీరికి నారా లోకేష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జిల్లాలో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని లోకేష్ సూచించారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, టిడిపి నేత గౌరు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లో రూ. 2 కోట్ల వ్యాపారం

డిఆర్‌డిఎ పిడి సలీంబాషా

ప్రజాశక్తి - కోడుమూరు : కోడుమూరు మహిళా మార్ట్ 2 కోట్ల రూపాయల వ్యాపార టర్నవర్‌తో చరిత్ర సృష్టించిందని డిఆర్‌డిఏ పీడీ సలీంబాషా అన్నారు. మహిళా మార్ట్ సేల్స్ గురువారానికి రూ. 2 కోట్లు అయిన సందర్భంగా మహిళా మార్ట్‌లో సంబరాలు నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ మహిళా మార్ట్ అధ్యక్షురాలుచే కేక్ కటింగ్ చేశారు. అనంతరం కోడుమూరులోని ఐకెపి కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా మార్ట్ సేల్స్ ఇంకా పెంచాలని దిశా నిర్దేశం చేశారు. మహిళా మార్ట్ వాటాధనం చెల్లించిన ప్రతి సభ్యురాలు మార్ట్ యజమానురాలని అన్నారు. సమావేశంలో ఎపిడి శ్రీధర్ రావు, డిపిఎంయు నుండి నరసమ్మ, శ్రీనివాసులు, అశోక్ కుమార్, పుష్పావతి, సిసిలు, విఒఎలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు మల్లేశ్వరి, జ్యోతి, వివిధ గ్రామాల సంఘం లీడర్లు పాల్గొన్నారు.



కోడుమూరు మహిళా మార్ట్ వద్ద డిఆర్‌డిఎ పిడి సలీంబాషా

డిమాండ్లు నెరవేర్చే వరకూ పోరాటం

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - వెల్దుర్తి

అంగన్‌వాడీల డిమాండ్లు అన్నీ నెరవేర్చేవరకూ పోరాటం కొనసాగుతుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌడ్ దేశాయ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం వెల్దుర్తిలోని ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో కొనసాగుతున్న 31వ రోజు అంగన్‌వాడీల నిరాహార దీక్షలనుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్‌లు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టం, షోకాజ్ నోటీస్‌లపై పెట్టిన శ్రద్ధ అంగన్వాడీల డిమాండ్లపై పెట్టి చర్చలకు పిలిపించి సమస్యలను వింటే అర్థమయ్యేదని, అలా చేయకుండా ప్రభుత్వ ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి దయాదాక్షిణ్యం లేకుండా షోకాజ్ నోటీసులు జారీ చేయమనడం సిగ్గుచేటన్నారు. రూ. 26 వేలు వేతనం, గ్రాడ్యుటీ, పెన్షన్ సౌకర్యం సాధించుకునే వరకు అంగన్వాడీల సమ్మె విరమించబోరని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలను మద్దతు కోరామని, అందరూ కలిసి రేపే కలెక్టర్ ఆఫీస్ ముట్టడిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే అంతకంటే జగమొండిగా పోరాడి అంగన్వాడీలు హక్కులు సాధించుకుంటారని తెలిపారు. అంగన్‌వాడీలకు కార్మిక సంఘాలు, అనేక ప్రజా సంఘాలు మద్దతు ఉందని, ఇప్పటినుండి రాజకీయ పార్టీల మద్దతు కూడా ఉంటుందని తెలిపారు. వెల్దుర్తి, క్రిష్ణగిరి ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి ఎస్ చాందిని, ఏఐటియుసి మండల కార్యదర్శి మాధవస్వామిలు మాట్లాడుతూ వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీక్షలో కూర్చున్న వారికి వారు మద్దతు తెలిపి అభినందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సిఐటియు మండల నాయకులు చిన్న, ఏసు, మారన్న, సత్యం తదితరులు పాల్గొన్నారు. **గూడూరు :** గూడూరులో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు 31వ సంఖ్య ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అరుణ, మద్దమ్మ, సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్‌లు మాట్లాడారు. అంగన్వాడి కార్మికులు అనంతమ్మ, రత్నమ్మ, సుజాత, రాజేశ్వరి, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు. **పత్తికొండ :** అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి గోపాల్, అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, బురుజుల రాముడు డిమాండ్ చేశారు. పత్తికొండలో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు కాంతమ్మ, పద్మజ, షాజహాన్, స్వర్ణలత, జ్యోతి, సుంకులమ్మ, బి.జ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతున్న డి.గౌస్‌దేశాయ్



అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

అక్రమ ఇళ్ల నిర్మాణాల కూల్చివేత

ప్రజాశక్తి - సి.బెళగల్

మండలంలోని గొల్లలదొడ్డిలో సర్వే నంబర్ 137/2లో చేపట్టిన అక్రమ ఇళ్ల నిర్మాణాలను డిపిఒ నాగరాజు నాయుడు అధికారగణంతో వెళ్లి కోర్టు ఉత్తర్వులతో గురువారం కూల్చివేశారు. ప్రభుత్వ భూమి సుమారు ఐదు ఎకరాలు ఇరవై సెంట్లు ఉండగా అందులో కృష్ణ గుడి 20 సెంట్లు, బజారి 15 సంట్లు, రంగన్న 3 సెంట్లు, సుంకన్న 5 సెంట్లు, బీరప్ప గుడి 3 సెంట్లు, బుడ్డన్న 4 సెంట్లు, వెంకటేష్ 6 సెంట్లు, బిముడు 4 సెంట్లు, చిన్న యంకన్న పెద్ద యంకన్న 4 సెంట్లు, పెద్ద బోజన్న 6 సెంట్లు ప్రభుత్వ పాఠశాల 30 సెంట్లు, చక్కరప్ప గుడి 2 సెంట్లు, వాల్మీకి గుడి 2 సెంట్లు, అల్లయ్య 4 సెంట్లు, సచివాలయం 6 సెంట్లు, ట్యాంకు 2 సెంట్లు, చంద్రమ్మ 3 సెంట్లు ఇలా అక్రమించుకున్నారని ఇటీవల కొందరు కోర్టులో పిల్ వేశారు. అలాగే జగన్, రమేష్‌లు కూడా స్థలం ఆక్రమించుకొని ఇళ్ళు నిర్మించుకున్నారని ఒక పార్టీకి ముడి పెట్టి కోర్టుకు వెళ్లారు. కోర్టు ఉత్తర్వుల మేరకు నిర్మాణాల కూల్చివేత గ్రామంలో ఆందోళనగా మారింది. ఎట్టకేలకు కూల్చివేసి, గొడవలకు పాల్పడరాదని కోడుమూరు సీఐ మన్సూర్ ఉద్దీన్, బెళగల్ ఎస్సై మన్మథ విజయ్, గూడూరు ఎస్సై పీరయ్యలు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, డిఎల్ పిఓ తిమ్మక్క, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్‌పి అడ్మిన్‌గా ఎన్.నాగరాజు బాధ్యతలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన అడిషనల్ ఎస్‌పి అడ్మిన్‌గా ఎన్.నాగరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అడిషనల్ ఎస్పీ జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.నాగరాజు స్వస్థలం తిరుపతి. 1989లో పోలీస్ శాఖలో ఎస్‌ఐగా చేరారు. ఎస్సైగా ఎక్కువ కాలం కడప జిల్లాలోని పలు ప్రాంతాల్లో పని చేశారు. 2000 సంవత్సరంలో సిఐగా ప్రమోషన్ పొంది కడప, ప్రకాశం జిల్లాలో పని చేశారు. 2011లో డిఎస్‌పిగా ప్రమోషన్ పొంది సిఐడి హైదరాబాద్, తాడిపత్రి, ఎసిబి వైయస్సార్ కడప, ప్రకాశం జిల్లా దర్శి, జమ్ముల మడుగులో పని చేశారు. ప్రస్తుతం వైయస్సార్ కడప జిల్లా జమ్ములమడుగులో డిఎస్‌పిగా పని చేస్తూ అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్‌పై బదిలీ అయి కర్నూలు జిల్లాకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అడిషనల్ ఎస్పీని పలువురు పోలీసు అధికారులు, డిపిఒ కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా ఎడిపై వరల్డ్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగర శివారులోని ఎడిపై వరల్డ్ స్కూల్ రెండవ వార్షికోత్సవ వేడుకలు గురువారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్కూల్ ఛైర్మన్ ఎకె అగర్వాల్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, స్కూల్ డైరెక్టర్లు డాక్టర్ సతీష్, డాక్టర్ గాంధీ, డాక్టర్ మనోజ్, అజిత్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఎకె అగర్వాల్, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిలు మాట్లాడారు. ప్రపంచ స్థాయి బోధన పద్ధతులతో కర్నూలు జిల్లాలో విద్యాబోధన అందించడం గర్వంగా ఉందన్నారు. విలువలతో కూడిన విద్యాబోధన చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం డైరెక్టర్లు మాట్లాడుతూ తమ పాఠశాలలో విభిన్న అంశాలతో బోధన చేస్తున్నామన్నారు. కార్పొరేట్ స్థాయికి తగ్గకుండా విద్యాబోధన అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో తమ పాఠశాల అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జోసఫ్ డేవిడ్, ఆప్కో మాజీ డైరెక్టర్ పి.నాగలక్ష్మయ్య, 33వ వార్డు కార్పొరేటర్ సాన శ్రీనువాసులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.





నృత్యం చేస్తున్న చిన్నారులు



వీక్షిస్తున్న డైరెక్టర్లు తదితరులు

'మున్సిపల్' సమ్మె విజయవంతం

- కార్మికులకు సిఐటియు అభినందనలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

గత 16 రోజులుగా సమ్మె చేస్తూ విజయం సాధించిన మున్సిపల్ కార్మికులకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు గురువారం ఓ ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. పోరాటాలు చేయడం ద్వారా ఎంత మొండి ప్రభుత్వాన్ని అయినా దిగి వచ్చేటట్లు చేయవచ్చని మున్సిపల్ కార్మికులు నిరూపించారని తెలిపారు. గతంలో ఇస్తున్న వేతనానికి రూ. 6 వేలు హెల్త్ అలవెన్స్‌ను కలిపి రూ. 21 వేలుగా నిర్ణయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం సమ్మెలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. **గూడూరు :** రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించినట్లు సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు శాంతన్న తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు మనోహరమ్మ, గుంతన్న, వెంకటేశ్వరమ్మ, లక్ష్మీదేవి, గోపాల్, దుర్గా, తదితర కార్మికులు పాల్గొన్నారు.

సిఐ హనుమంతప్ప బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆస్పరి

తిరుపతి పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న హనుమంతప్ప ప్రమోషన్‌పై ఆస్పరి సిఐగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో టెట్రా ప్యాకెట్లు, మద్యం బెల్ట్ షాపులు, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సిఐగా బాధ్యతలు చేపట్టిన హనుమంతప్పను కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ రాఘవేంద్ర, సొసైటీ మాజీ ఛైర్మన్ నౌనేపాటి చౌదరి, టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, తెలుగు యువత అధికార ప్రతినిధి రాజకుమార్, టిడిపి నాయకులు చంద్ర శేఖర్ కలిసి అభినందనలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న హనుమంతప్ప

టిడిపి నాయకునికి మాతృ వియోగం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని మండిగిరికి చెందిన టిడిపి నాయకులు గాజుల నాగరాజు తల్లి మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు నాగరాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు. మట్టి ఖర్చులకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. టిడిపి మండిగిరి ఇన్‌ఛార్జీ శ్రీనివాస్ ఆచారి, డిష్ ఈరన్న, మల్లేశప్ప, నరేంద్ర, డిష్ రవి, సురేంద్ర పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మీనాక్షి నాయుడు

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాలి

- సబ్ కలెక్టర్‌కు జనసేన నాయకుల వినతి

ప్రజాశక్తి - ఆదోని

ప్రజల ప్రాణాల పట్ల నిర్లక్ష్యం వహించే ప్రయివేట్ ఆస్పత్రుల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జనసేన మండల అధ్యక్షులు ఎం.తాహేర్ వలీ, నాయకులు పులి రాజు డిమాండ్ చేశారు. గురువారం ఆదోని సబ్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మధు ఆస్పత్రి, శ్రీసాయి నర్సింగ్ హోమ్‌లో జరిగిన వరుస సంఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్యం దొరుకుతుందని ఆశపడిన ప్రజలపై ఆదోని మధు ఆస్పత్రి యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సంఘటన అనంతరం బాధితులకు పరిహారం ఇచ్చి తప్పించుకుంటున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మరోసారి ఇలాంటి ప్రాణనష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదోనిలోని ప్రయివేట్ క్లినిక్‌లతో పాటు, ప్రయివేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లపై తనిఖీలతో సరిపెట్టకుండా లోపాలపై దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలన్నారు.


సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

టిబి రోగుల దత్తతకు ముందుకు రావాలి

- డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి

ప్రజాశక్తి - ఆదోని

టిబి రోగులను దత్తత తీసుకునేందుకు దాతలు ముందుకు రావాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి తెలిపారు. ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఆదోనిలోని టిబి కేంద్రంలో గురువారం టీచర్ నిరంజన్ కుమార్ రూ.వెయ్యి విలువ చేసే పోషకాహార కిట్లను 10 మంది పేద టిబి రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దాతలు ముందుకొచ్చి టిబి రోగులను దత్తత తీసుకోవాలని కోరారు. డాక్టర్ బాలమురళీ కృష్ణ, డాక్టర్ అమూల్య, ఎంపిహెచ్ఎస్‌లు బాబురాజు, లలితమ్మ, ఎస్‌టిఎస్ స్వరూప్ రాజ్‌కుమార్, టిబిహెచ్‌వి సుబ్బమ్మ బాయి పాల్గొన్నారు.


రోగులకు కిట్లను పంపిణీ చేస్తున్న సత్యవతి

వరి గడ్డి తింటూ అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి-ఆలూరు

'అధికారం చేపడితే సమస్యలు పరిష్కరిస్తారని నమ్మి ఓట్లు వేసినందుకు మాకు బాగా గడ్డి పెట్టావు జగనన్న' అని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాలూకా కార్యదర్శి జయశ్రీ విమర్శించారు. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల చేపట్టిన సమ్మె గురువారం 31వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వరిగడ్డి తింటూ నిరసన చేపట్టారు. అనంతరం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జయశ్రీ మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పాదయాత్ర సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతన్నామని చెప్పారు. ఇవేవీ పరిష్కరించకుండా ఎస్మా చట్టాన్ని ఉపయోగిస్తూ బెదిరింపులకు పాల్పడడం ప్రభుత్వ అవివేకమన్నారు. సిపిఎం నాయకులు షాకీర్, కృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు మైనా, అంగన్వాడీ యూనియన్ నాయకులు భారతి, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **కౌతాళంలో** అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. అంగన్వాడీ సమ్మె విరమించి, విధుల్లో చేరాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించడం పిరికిపంద చర్య అని విమర్శించారు. అంగన్వాడీలకు ఇస్తున్న షోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకొని, చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు విజయలక్ష్మి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** అంగన్వాడీ యూనియన్ సమైక్య చేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరింది. సిడిపిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, ప్రభుత్వానికి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, నాయకులు నాగలక్ష్మి, నాగేశ్వరమ్మ, వరలక్ష్మి, శైలజ, కృష్ణవేణి, సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు తాలూకా కార్యదర్శులు రాముడు, తిమ్మగురుడు, రాజు మాట్లాడారు. అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు ఆపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభావతి, తులసి, రామేశ్వరి, బండ లత, గాయత్రి, యుఎం.నాగలక్ష్మి, పుష్పావతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు. **మంత్రాలయం** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో గల ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, ఉపాధ్యక్షులు విశాలాక్షి, భీమేశ్వరి, ప్రమీల, లావణ్య మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు విఆర్ఒల ద్వారా నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేయడం దుర్మార్గమని తెలిపారు. ప్రభుత్వం నోటీసులు ఇచ్చినా తీసుకునేది లేదని, సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. **పెద్దకడబూరులో** అంగన్వాడీల సమ్మె 31వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీలు విధుల్లో చేరేలా ప్రభుత్వం నోటీసులు ఇవ్వాలని తహశీల్దార్ ఆధ్వర్యంలో అంగన్వాడీ సూపర్ వైజర్లు నోటీసులు తయారు చేశారు. దీనిపై అంగన్వాడీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. చివరకు కార్యాలయంలోకి వెళ్లి సూపర్‌వైజర్లతో వాగ్వాదానికి దిగారు. వీరికి సిఐటియు గౌరవాధ్యక్షులు తిక్కన్న, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్ మద్దతు పలికారు. సమస్య పరిష్కరించకుండా అధికారుల చేత ఉద్యమాన్ని ఆపాలనుకోవడం ప్రభుత్వ పిరికిబంద చర్య అని విమర్శించారు. థెరిస్సమ్మ అనే అంగన్వాడీ కార్యకర్త సొమ్మసిల్లి పడిపోవడంతో తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. ఇలాగే ఉంటే ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు.


ఆలూరులో వరి గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


కౌతాళంలో మాట్లాడుతున్న రామాంజనేయులు


ఎమ్మిగనూరులో ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు

టిడిపితోనే బీసీలకు న్యాయం : బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

బీసీలకు న్యాయం చేసిన ఏకైక పార్టీ టిడిపి అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం గోనెగండ్ల గ్రామంలో జరిగిన 'జయహో బీసీ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా టిడిపి కార్యాలయం దగ్గర జ్యోతిరావు పూలే, కనకదాసు, వాల్మీకి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. టిడిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీగా సంత మార్కెట్‌లోని పంచాయతీ కార్యాలయం వరకు వెళ్లారు. అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడారు. బీసీల పట్ల వైసిపి కపట ప్రేమ నటిస్తోందని, కేవలం అధికారం కోసం బీసీలను వాడుకుని వదిలేసిందని విమర్శించారు. బీసీలకు పెద్దపీట వేసి రాజ్యాధికారం ఇచ్చిన పార్టీ టిడిపి అని తెలిపారు. కేవలం ఎన్నికల ముందు వైసిపికి బీసీలు గుర్తుకొస్తున్నారని విమర్శించారు. సంక్షేమం పేరుతో ముఖ్యమంత్రి జగన్ ముద్దుల మీద ముద్దులు పెట్టి చివరకి పిడి గుద్దులు గుద్దారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా కొనసాగించే సత్తా ఉన్న సీనియర్ నేత అని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉండి, అభివృద్ధిని కొనసాగించేందుకు చంద్రబాబు వస్తున్నారని అన్నారు. బీసీ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు సత్రం రామకృష్ణ, నజీర్ సాహెబ్, ఎన్‌వి.రామాంజనేయులు, తిరుపతయ్య నాయుడు, కులుమాల రాముడు, వెంకట కృష్ణ నాయుడు, రమేష్ నాయుడు, రంగస్వామి నాయుడు, సర్పంచి హైమావతి, పూజారి చంద్ర, వెంకటేశ్వర్లు, చిన్ననేలటూరు నాగన్న, ఎర్రబాడు శ్రీను, గాజులదిన్నె హనుమంతు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

నగరడోనాలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి - చిప్పగిరి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తలపెట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం గురువారం నగరడోనా గ్రామంలో ఎంపిడిఒ కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, బిజెపి మండల అధ్యక్షులు పరంధామయ్య హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై మండల అధికారులంతా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమం కింద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిప్పగిరి ప్రభుత్వాస్పత్రి సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది అంతా వచ్చిన వారందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. సర్పంచి మల్లమ్మ, వైసిపి నాయకులు నాగేంద్ర, ఎంఇఒ సావిత్రమ్మ, ఎఒ జయలక్ష్మి, ఇఒఆర్‌డి బాలన్న, ఎపిఎం నాగార్జున, ఎపిఒ మాధవ శంకర్ పాల్గొన్నారు.


నగరడోనాలో సంకల్ప యాత్రలో పాల్గొన్న అధికారులు

గ్రామ నాయకుని అక్రమ సంపాదన

- ఎమ్మెల్యే ఏ కార్యక్రమంలో పాల్గొంటే అక్కడ ప్రత్యక్షం...

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని మారుమూల గ్రామానికి చెందిన ఓ చోట గ్రామ నాయకుడు అక్రమ మద్యం, ఇసుక, పేకాట ద్వారా రూ.లక్షల్లో కూడబెట్టుకున్నట్లు సమాచారం. పట్టణ, గ్రామీణ ప్రాంతాలని తేడా లేకుండా ఎమ్మెల్యే ఏ కార్యక్రమానికి హాజరైతే అక్కడ హాజరవుతూ పోలీసులు, ప్రెస్‌తో పరిచయాలు పెంచుకుంటూ తన వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలు కొనసాగిస్తున్నారని ఆ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. గ్రామంలో ప్రధాన నాయకునిగా చెప్పుకుంటూ తన వ్యాపారులకు అడ్డు వచ్చిన వారిపై పోలీసు స్టేషన్‌లో కేసులు పెడతామని బెదిరిస్తూ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, యువ నాయకులు జయ మనోజ్ రెడ్డి పేరు వాడుకుంటూ తన అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని చర్చలు సాగుతున్నాయి. సరిహద్దు గ్రామాల్లో ఇసుక, పేకాట, అక్రమ మద్యం ద్వారా కరోనా సమయంలో కొన్ని రూ.లక్షలు కూడబెట్టుకున్నట్లు సమాచారం. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో తన స్పీడును మరింత పెంచుకున్నట్లు తెలిసింది. ఈయనకు పోలీసు స్టేషన్‌లో కూడా రాచరిక మర్యాదలు జరుగుతున్నట్లు సమాచారం. ఒక మండల స్థాయి అధికారిని మధ్యవర్తిగా పెట్టుకొని పెద్ద ఎత్తున పర్సంటేజీలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల స్థాయి అధికారికి కూడా రాచరిక మర్యాదలు అందిస్తూ పర్సంటేజీలు దండుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యేకు కానీ, వైసిపి నాయకులకు కానీ గ్రామ నాయకుని వ్యవహారం తెలియదా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈయన చేతిలో పడి నలిగిపోయిన గ్రామస్తులు రాబోయే ఎన్నికల్లో వైసిపికి తగిన గుణం పాఠం చెబుతామని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి దృష్టి సారించకపోతే రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేకు కొంతమేర మైనస్ అవుతుందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

మున్సిపల్ కార్మికులకు అభినందనలు : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత 16 రోజులుగా సమ్మె చేస్తూ సమ్మెను విజయం చేసిన మున్సిపల్ కార్మికులకు సిఐటియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సి.గోవిందు, బి.రాముడు అభినందనలు తెలిపారు. పోరాటాలు చేయడం ద్వారా ఎంత మొండి ప్రభుత్వాన్ని అయినా దిగి వచ్చేటట్లు చేయవచ్చని మున్సిపల్ కార్మికులు నిరూపించారని అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో ఇస్తున్న వేతనానికి రూ.6 వేలు, హెల్త్ అలవెన్స్ కలిపి రూ.21 వేలుగా నిర్ణయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాబోవు కాలంలో పిఆర్‌సి పెరిగినప్పుడు బేసిక్ ఆధారంగా వేతనాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం అదనపు లాభం కలిగే అవకాశం ఉందని చెప్పారు. గతంలో కార్మికుడు చనిపోతే ఇచ్చే రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచినట్లు తెలిపారు. పని చేసే సందర్భంలో చనిపోయిన కార్మికునికి సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం రూ.30 లక్షలు, శాశ్వత అంగవైకల్యానికి రూ.20 లక్షలు, వైకల్యానికి రూ.10 లక్షలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని చెప్పారు. రిటైర్ అయ్యే అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.75 వేలు గ్రాట్యుటీ ఇవ్వడానికి ఒప్పుకుందని తెలిపారు. కనీసం 10 సంవత్సరాలు పనిచేసిన వారికి ఇది వర్తిస్తుందని చెప్పారు.

నేడు చిప్పగిరికి కోట్ల సుజాతమ్మ రాక

- టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ

ప్రజాశక్తి - చిప్పగిరి



మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జయహో బీసీ'ని పెద్దఎత్తున నిర్వహించేందుకు టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ శుక్రవారం చిప్పగిరికి వస్తున్నారని టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే 'జయహో బీసీ' సభకు మండలంలోని బీసీలు, మహిళలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, బాలకృష్ణ అభిమానులు, టిడిపి యూత్ సంఘాలు, కోట్ల అభిమానులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఘనంగా జితామిత్ర తీర్థుల ఆరాధన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో శ్రీజితామిత్ర తీర్థుల ఆరాధనను ఘనంగా నిర్వహించారు. గురువారం కర్ణాటక రాష్ట్రంలోని శ్రీజితామిత్ర గడ్డలోని జితామిత్ర తీర్థుల బృందావనాన్ని నిర్మాల్యం చేసి, పంచామృతాభిషేకం, అభిషేకం నిర్వహించారు. ఆరాధన సందర్భంగా జితామిత్ర తీర్థుల దర్శనార్థం వచ్చిన భక్తులకు ముద్రాధారణతో ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

శ్రీమఠంలో అధమార మఠం పీఠాధిపతులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని అధమార మఠం పీఠాధిపతులు శ్రీవిశ్వప్రియ తీర్థులు దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం పండితులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆయనకు పూల మాల వేసి శాలువా వేసి సన్మానించారు. విశ్వప్రియ తీర్థులు కూడా పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.


పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ తిమ్మయ్య

ముగతి సర్కిల్‌లో వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని ముగతి సర్కిల్‌లో ఎస్ఐ తిమ్మయ్య వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తున్నామని, అందుకు వాహనదారులు సహకరించాలని కోరారు. వాహనాల్లో ఎలాంటి మత్తు పదార్థాలను తరలించరాదని, అలా తరలిస్తే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనానికి సంబంధించిన ప్రతి పత్రాన్ని వాహనదారులు తమ వద్ద ఉంచుకోవాలని, రోడ్డు భద్రత నియమాలను పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని తెలిపారు. మత్తు పదార్థాలు తరలిస్తున్నట్లు ఎవరికైనా సమాచారం అందితే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వ్యక్తి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

- 1500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం - నలుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని హనుమాపురం గ్రామ కొండలపై గురువారం పెద్దకడబూరు పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. పెద్దకడబూరు ఎస్ఐ మహేష్, పోలీసు సిబ్బందితో కలిసి హనుమాపురం కొండల్లో నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని నాగలదిన్నె గ్రామంలో వడ్డే రాజుల ముద్దుబిడ్డ ఓబన్న 217వ జయంతి వేడుకలను వడ్డే సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. గురువారం వడ్డే వీధిలో వడ్డే ఓబన్న చిత్రపతాన్ని ఏర్పాటు చేసి, పాలాభిషేకం చేశారు. అనంతరం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వడ్డెర సంఘం అధ్యక్షులు భీమన్న, సభ్యులు నాగరాజు, శ్రీనివాసులు, రాజు, ఎల్లప్ప, నాగరాజు, జమ్మన్న, పంపన్న పాల్గొన్నారు.


వడ్డే ఓబన్న చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వడ్డెరలు

శబరికి బయల్దేరిన అయ్యప్ప స్వాములు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని తంగరడోణ గ్రామంలోని అయ్యప్ప దేవాలయంలో గురు స్వామి గోవిందు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు ఇరుముడి కట్టి శబరిమలైకు గురువారం బయల్దేరారు. ఈ సందర్భంగా గురు స్వామి మాట్లాడారు. ఎంతో నిష్టతో 41వ రోజు అయ్యప్ప మాల ధరించి పూజ చేశారన్నారు. ముందుగా ఉదయం స్వామి వారి ఆలయంలో స్వామికి ఆకు పూజ, పుష్పాభిషేకం, మహా మంగళహారతి, మెట్ల పూజ చేసి ఇరుముడిని ప్రారంభించారు. సాయంత్రం 5 గంటలకు స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి భక్తులు మేళతాళాలతో చింతల ముని స్వామి దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ పూజలు చేసి శబరి బయల్దేరి వెళ్లారు. వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.


పూజలు నిర్వహిస్తున స్వాములు


షుబ్లీని సన్మానిస్తున్న సభ్యులు

మత సామరస్యానికి ఫారూఖ్ షుబ్లీ కృషి ప్రశంసనీయం

- ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

సేవా కార్యక్రమాలతో తెలుగు రాష్ట్రాల్లో మత సామరస్యం నెలకొల్పేందుకు ఎంహెచ్‌పిఎస్ అధ్యక్షులు ఫారూఖ్ షుబ్లీ కృషి ప్రశంసనీయమని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ అహ్మద్, కుబేర స్వామి తెలిపారు. గురువారం విజయవాడలోని కార్యాలయంలో పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. వారు మాట్లాడుతూ... హిందూ దేవాలయాలను సందర్శించి భక్తులకు అన్నదానం చేయడం, విశేష సమయాల్లో విజయవాడ కనక దుర్గమ్మ గుడికి వెళ్లే వేలాది మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారని తెలిపారు. బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాల రచయిత విజయేంద్ర ప్రసాద్ సైతం ఒక సభలో ఫారూఖ్ షుబ్లీ సేవలను తలచుకొని భావోద్వేగానికి లోనయ్యారని చెప్పారు. సర్దార్ అహ్మద్, వసీం సాహెబ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలి : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి పరికరాలు ఏర్పాటు చేయాలని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు కోరారు. గురువారం ఆదోనికి వచ్చిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఎస్‌పి.సింగ్ బఘేల్‌కు వినతిపత్రం అందజేశారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి బోయ తేజ మాట్లాడారు. పాము, తేలు కాటుకు మందుల కొరతతో ప్రాణాలు బలి తీసుకున్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ప్రతి చిన్న జబ్బుకూ కర్నూలు ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేస్తున్న దుస్థితి నెలకొందన్నారు. జ్వరాలకు, చిన్నపాటి గాయాలకూ సరైన వైద్యం అందించలేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఆదోని నియోజకవర్గ అధ్యక్షులు బెస్త సూర్య, ప్రధాన కార్యదర్శి బల్లేకల్ సూర్య, నియోజకవర్గ ఉపాధ్యక్షులు నూర్, మంజు, హేమంత్, మనోజ్, అభి, తరుణ్, భాస్కర్ పాల్గొన్నారు.



కర్నూలు ఎంపి అభ్యర్థిగా గుమ్మనూరు


- ఆలూరు సమన్వయకర్తగా విరూపాక్షి
- కోడుమూరుకు డాక్టర్ సతీష్
- వైసిపి మూడో జాబితా విడుదల

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వైసిపి సమన్వయకర్తల మూడో జాబితాను ఆ పార్టీ అధిష్టానం గురువారం రాత్రి విడుదల చేసింది. వైసిపి తరపున రాబోయే ఎన్నికల్లో కర్నూలు ఎంపి స్థానానికి, ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాలకు పోటీ చేసే అభ్యర్థులను అధిష్టానం ఖరారు చేసింది. వాస్తవానికి వైసిపి తరపున సమన్వయకర్తల మూడో జాబితా బుధవారం సాయంత్రానికే విడుదల చేయాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల జాబితా ప్రకటన వాయిదా వేశారు. ఆ జాబితాను గురువారం రాత్రి విడుదల చేసింది.

కర్నూలు ఎంపి అభ్యర్థిగా ప్రస్తుత కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేరును ఖరారు చేసింది. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా బిసికే కేటాయించాలని అధిష్టానం నిర్ణయించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరో వైపు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు నియోజకవర్గాల సమన్వయకర్తలను కూడా మార్పు చేయాలని వైసిపి అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు పలువురు నాయకులతో సిఎం జగన్ మోహన్ రెడ్డి చర్చలు జరిపారు. కర్నూలు ఎంపి అభ్యర్థిగా గుమ్మనూరు జయరాంకు అవకాశం ఇవ్వనున్న నేపథ్యంలో ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా చిప్పగిరి జడ్పీటీసీ విరూపాక్షి పేరును ఖరారు చేసింది. కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ సతీష్‌ను నియమించింది. తనకు మొండి చేయి చూపడంతో ఇప్పటికే కర్నూలు ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్ ఎంపి పదవికి, వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.





డాక్టర్ సతీష్


నందికొట్కూరు సమన్వయకర్త మార్పు?

జిల్లాలో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్కెన నందికొట్కూరు సమన్వ యకర్తను మార్పు చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం నందికొట్కూరు ఎమ్మెల్యేగా ఉన్న తోగూరు ఆర్థర్ స్థానంలో ఇతరులను నియోజకవర్గ సమన్వ యకర్తగా నియమించి వారికి ఎమ్మెల్యే అభ్యర్థులుగా అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న రెండు స్థానాల్లో ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈ సారి జగన్ మోహన్ రెడ్డి మొండిచేయి చూపనున్నట్లు సమాచారం. ఈ అంశంపై ఇప్పటికే ఆర్థర్, సుధాకర్‌తో పాటు నందికొట్కూరు అభ్యర్థి అంశంపై శాప్ ఛైర్మన్ బ్కైరెడ్డి సిద్ధార్థరెడ్డితోనూ, కోడుమూరు అభ్యర్థి అంశంపై కుడా ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డితోనూ ఆ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పలు దఫాలుగా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్తగా గంగాధర్ పేరును అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. తమకు అవకాశం ఇవ్వలేమని అధినేత తేల్చి చెప్పడంతో ఆర్థర్, సుధాకర్ ఇద్దరూ తమ భవిష్యత్ కార్యాచరణ గురించి సంశయంలో పడినట్లు సమాచారం.

నంద్యాల ఎంపిగా అలీ ?



నంద్యాల పార్లమెంట్ పరిధిలో ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉండటంతో ఆ స్థానాన్ని ముస్లింలకే ఇవ్వాలని వైసిపి అధిష్టానం నిర్ణయిం చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నంద్యాల వైసిపి ఎంపి అభ్యర్థిగా సినీ నటుడు అలీ పేరును అధిష్టానం ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది.



లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్మన్ జిల్లా జాయింట్ కలెక్టర్ తదితరులు

చిరు వ్యాపారులకు జగనన్న తోడు అండ

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకం అండగా నిలుస్తోందని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. 8వ విడత జగనన్న తోడు పథకం కింద పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ రూ.431.58 కోట్లను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న తోడు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహా దారుడు హబీబుల్లా, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ జగనన్న తోడు పథకం కింద 8వ విడత ద్వారా జిల్లా వ్యాప్తంగా 14,763 మంది లబ్ధిదారులకు రూ.31.55 లక్షల రుణాల పంపిణీ చేశామన్నారు. అలాగే రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన 14,142 మంది లబ్ధిదారులకు రూ.14.96 కోట్ల వడ్డీని రీయింబర్స్మెంట్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి జమ చేశారన్నారు. ప్రభుత్వం అందిస్తోన్న జగనన్న తోడు ఆర్థిక సహాయాన్ని చిరు వ్యాపారులు చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. వడ్డీలు, చక్ర వడ్డీలు కట్టలేక అవస్థలు ఎదుర్కొంటున్న చిరు వ్యాపారులు, సాంప్రదాయ చేతులు వత్తుల వారి ఉపాధికి జగనన్న తోడు ఆసరాగా ఉంటుందన్నారు. జెసి టి. రాహూల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చిరు వ్యాపారుల కష్టాలు తీర్చేందుకు జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించిన లబ్ధిదారులకు వడ్డీ రియంబర్స్మెంట్ కింద 14,142 మంది లబ్ధిదారులకు రూ.14.96 కోట్ల వడ్డీని జమ చేశామన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 1712 మంది లబ్ధిదారులకు రు.3.56 లక్షలు, బనగానపల్లిలో 1939 మందికి రూ.3.88 లక్షలు, డోన్‌లో 2539 మందికి రూ.5.61 లక్షలు, నందికొ ట్కూర్‌లో 3014 మందికి రూ.6.90 లక్షలు, నంద్యాలలో 2576 మందికి రూ.5.02 లక్షలు, పాణ్యంలో 844 మందికి రూ.1.58 లక్షలు, శ్రీశైలంలో 2139 మందికి రూ.4.97 లక్షలు జమ చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా ఏవరైనా అర్హత ఉండి కూడా పథకం అందకపోతే వారికి కూడా లబ్ధి చేకూరుస్తామన్నారు. జగనన్న తోడు పథకం చిరు వ్యాపారులకు పెట్టుబడితో పాటు జీవనోధికి ఉపయోగపడుతోం దన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారుడు హబీబుల్లా మాట్లాడుతూ ఇతరులపై అధార పడకుండా స్వయం ఉపాధితో జీవిస్తూ, మరో ఒకరిద్దరి సైతం కూడ ఉపాధి కల్పిస్తున్న, చిరు వ్యాపారులు అధిక వడ్డీల బారిన పడకుండా వారికి జగనన్న తోడు అండగా నిలబడుతుందన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు, తదితరులు లబ్ధిదారులకు చెక్కును అందజేశారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం

- షోకాజ్ నోటీసులను తిరస్కరించిన అంగన్వాడీలు
- 6వ రోజు కొనసాగిన 24 గంటల నిరాహార దీక్షలు
- 31వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె



ఆత్మకూర్ అంగన్వాడీ దీక్షా శిబిరానికి చేరుకున్న పోస్ట్‌మెన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంగన్వాడీల సమస్యల పరిష్కరించే వరకు పోరాటం ఆగదని, ఎన్ని నోటీసులు ఇచ్చిన బెదిరించాలని చూసిన తగ్గేదే లేదంటూ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. ఏసురత్నం, ఏ. నాగరాజు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మలమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి నాగరాణి,ప్రాజెక్ట్ కార్యదర్శి సునీతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 31వ రోజుకు చేరిన అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం చేపట్టిన అంగన్వాడీల 24 గంటల రిలే నిరాహార దీక్షలను కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల ప్రజాశక్తి ఎడిషన్ ఇంచార్జ్ పానుగంటి చంద్రయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోరికలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వానికి సూచించారు. అంగన్వాడీలు ఐక్యతతో పోరాడాలని అప్పుడే సమస్యలు పరిస్కారమౌతాయాన్నారు. 31 రోజులుగా సమ్మె ఆందోళన చేస్తున్న అంగన్వాడీలలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు 26 వేలకు పెంచాలని, వారి న్యాయమైన డిమాండ్లపైన తక్షణమే ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని కోరారు. సమ్మెను వెంటనే విరమింపజేసి గర్భిణీ, బాలింతలకు, పిల్లలకు పౌష్టిక ఆహారం అందించిలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను ఎస్మా చట్టంలోకి తేవడం శోచనియమన్నారు. వారిపైన విధించిన ఎస్మాను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోట మద్దులు,సహాయ కార్యదర్శి బాలవెంకట్,పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి. లక్షణ్, కె ఎం డి గౌస్ తదితరులు పాల్గొన్నారు. 24 గంటల రిలే నిరాహార దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం తెలిపిన వారిలో ప్రజాశక్తి సిబ్బంది విలేకరులు మాదాల శ్రీనివాసులు, మౌలాలి, మల్లికార్జున సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు. **బేతంచెర్ల :** అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి శేబా రాణి ప్రభుత్వాన్ని కోరారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 31వ రోజు చేరుకున్న సందర్భంగా బేతంచెర్ల భారత్ బేకరీ సర్కిల్ నందు అంగన్వాడీల చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్. గుల్జార్ బి, సలోమి రాధమ్మ, అంజమ్మ, అనూష, రాజేశ్వరి, రాధమ్మ రమాదేవి, చంద్రకళ, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** విధుల్లోకి చేరకపోతే చర్యలు తీసుకుంటా మంటూ అధికారులు పోస్టు ద్వారా పంపించిన నోటీసులను అంగన్వాడీలు తిరస్కరించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం వద్ద దీక్ష శిబిరంలో అంగన్వాడీలు నిరవధిక సమ్మె కొనసాగించారు. **పాణ్యం:** మండల కేంద్రమైన పాణ్యంలో డిమాండ్లను పరిష్కరించాలని అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు, ఎంపీడీవో కార్యాలయం దగ్గర నల్ల బెలూన్లతో ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో నిరసన తెలిపారు. ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా నాయకులు కేఎండి గౌస్ వెంకట లింగం, అంగన్వాడి వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు నిర్మల, మండల కార్యదర్శి కె భాస్కర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు వెంకటమ్మ, మాబునిస, హైమావతి, సూర్య, ప్రభావతి, అనసూయ, లక్ష్మీదేవి, ప్రభావతి, శివమ్మ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ఎత్తివేసి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణి, తదితరులు ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించి ఎంపీడీవో శివరామయ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.వి. సుబ్బయ్య, యూనియన్ సభ్యులు రమాదేవి, వరలక్ష్మి, మల్లేశ్వరి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** మండలంలో అంగన్వాడీలు రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. సిఐటియు జిల్లా పి దావీదు, నాయకురాలు పద్మావతి, త్రివేణి, రేణుక, లీలావతి, శ్రీదేవి, ప్రభావతి, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరిం చకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. **ఆత్మకూరు :** పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ఓం, అల్లా, సిలువ ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యాక్షులు రణధీర్‌లు మాట్లాడారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించినంత మాత్రాన అంగన్వాడీలు బెదిరిపోరని, సమ్మె యదార్థంగా కొనసాగుతుందని హెచ్చరించారు. సిఐటియు నాయకులు సురేంద్ర, స్వాములు, నరసింహ నాయక్, మాబాషా, వీరన్న, గణపతి, అంగన్వాడి యూనియన్ నాయకురాలు సుధారాణి, లక్ష్మి, ప్రియాంక, రవణమ్మ, విజయలక్ష్మి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు తిరస్కరణ - వెనుదిగిరిన పోస్ట్‌మాన్‌లు

అంగన్వాడీలకు అధికారులు పోస్టు ద్వారా పంపిన షోకాజ్ నోటీసులను అందజేసేందుకు పోస్టుమ్యాన్‌లు దీక్షా శిబిరం వద్దకు వచ్చారు. పోస్టుమ్యాన్‌లు నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నించగా అంగన్వాడీలు తమకు నేరుగా నోటీసులు **మిగతా 6వ పేజీలో...**

ఎస్మాకు అంగన్వాడీలు భయపడరు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు నాగరాజు

ప్రజాశక్తి - నంద్యాల

ఎస్మా చట్టం ఉపయోగిస్తే అంగన్వాడీలు భయపడరని సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నూనపల్లె పార్టీ కార్యాలయం నందు 'ఎస్మా చట్టం వద్దు అంగన్వాడీలకు జీతాలు పెంచాలి' అని అన్నీ రాజకీయ పార్టీలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. ఈ సమావేశానికి సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసు రత్నం, కాంగ్రెస్ పార్టీ నుండి చింతలయ్య, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు శంకర్, సమాజ్‌వాద్ పార్టీ జిల్లా కార్యదర్శి పెరుగు శివ కృష్ణ యాదవ్, సిపిఐ (ఎమ్మెల్) రెడ్ స్టార్ జిల్లా నాయకులు గాలి రవిరాజు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి రాజు నాయుడు, వెల్ఫేర్ పార్టీ జిల్లా నాయకులు అన్సర్, తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు మాట్లా డుతూ డిసెంబర్ 12 నుంచి సమ్మె చేస్తుంటే 24 రోజుల తర్వాత అత్యవసర సర్వీసులుగా గుర్తించి ఎస్మా చట్టాన్ని పెట్టి అంగన్వాడీలను భయ పెట్టాలని చూస్తే ఊరుకోమని అన్నారు. చట్టబద్ధంగా తాము నవంబర్ 11 అందరికీ నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. సమ్మె చేయడం న్యాయపరమైన హక్కు అని పేర్కొన్నారు. దీనిపై ఎస్మా ప్రయోగించి సర్వీస్ నుండి ఎందుకు తొలగించాలని చూస్తుందో చెప్పాలన్నారు. బెదిరించడం మానుకొని నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చర్చలకు సిద్ధమని చెప్పిన షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని ఖండించారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి బలవంతంగా తెరిపించిందని లబ్ధిదారులు ఎవరు కేంద్రాలకు రావడంలేదని, వారెవ్వరు అంగన్వాడీలపై ఫిర్యాదు చేయలేదని తెలిపారు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రాన్ని ఉపయోగించడం మానుకొని నోటీసులు ఉపసంహరించుకోవాలన్నారు. చర్చలు జరిపి అంగన్వా డీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిం చాలని కోరారు. అంగ న్వాడీల ఉద్యమం ఆకలి ఉద్యమం అని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ఆకలి విలువ తెలియదన్నారు. ఇలాంటి నీరో చక్రవర్తి పరిపాలనలో మరింత ఐక్యతతో అన్ని ప్రజా సంఘాలు అన్ని రాజకీయ పార్టీలు పట్టుదలగా ఉద్యమించాలని వారు పేర్కొన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శులు డి లక్ష్మణ్, నాయకులు జైలాన్, సభ్యులు హరి, డేవిడ్, సాయి, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఓ, ఎంపిపి, ఇతర ప్రముఖులు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాశక్తి దినపత్రిక శ్రీశైలం నియోజకవర్గం-2024 క్యాలెండర్‌ను ఎంపిడిఓ అమానుల్లా, ఎంపిపి లాలం రమేష్‌తో పాటు ప్రముఖులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రజాశక్తి దినపత్రిక దినదినాభివృద్ధి చెందుతూ, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం ప్రతినిత్యం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నాయకులు మహమ్మద్ రఫీ, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వర రెడ్డి, వైసిపి మండల ఉపాధ్యక్షుడు (కాంట్రాక్టర్) రామ్మోహన్ రెడ్డి, యువ నాయకులు మదీనా చికెన్ షంషేర్, గోవర్ధన్ రెడ్డి, ఎంపిటిసి చాంద్ బాషా, ముస్లిం ఐక్యవేదిక నాయకులు సయ్యద్ నూరుల్లా, ఎంపిడిఓ కార్యాలయ పరిపాలన అధికారి ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల పర్యవేక్షణ ఇంజనీరింగ్ అసిస్టెంట్లదే

- మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పార్కుల నిర్వహణ మెయింటెనెన్స్ బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లదేనని మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోనే తన ఛాంబర్ లో పట్టణంలోని ఆయా సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పలు సూచనలు సలహాలు చేశారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో,కాలనీలో ఉన్న పార్కులను నిత్యం పర్యవేక్షించడంతోపాటు, వాటి నిర్వహణ, మెయింటెనెన్స్ బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ నుండి వివిధ కూడళ్ళలో ఉన్న ప్రధాన వీధుల వెంట ఉన్న మీడియన్ల నిర్వహణ, వాటి మధ్య ఉన్న చెట్లు ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత వీరిదే నన్నారు. అలాగే పట్టణంలో వార్డుల్లో సచివాలయాల పరిధిలో వీధిలైట్లు సమస్య లేకుండా నిత్యం రాత్రి పూట వెలిగేలా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ఇంజనీర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

వైసిపితోనే అభివృద్ధి : ఎమ్మెల్యే



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైసిపితోనే అభివృద్ధి సాధ్యం అని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవి రెడ్డి పేర్కొన్నారు. గురువారం నంద్యాల వన్ టౌన్ నుండి షాలిమార్ మసీదు వరకు రూ.26 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రైన్‌లను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీ సాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము అధికారంలో వచ్చిన తర్వాత నంద్యాల ఓల్డ్ టౌన్ రూపురేఖలను మార్చామని, ప్రత్యేకంగా దృష్టి సారించి అన్ని వార్డులలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. తాము చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఓల్డ్ టౌన్‌లో దాదాపు రెండు కోట్ల రూపాయలతో సెంట్రల్ రోడ్డును నిర్మించామని, త్వరలో మరో రూ.40 లక్షల రూపాయల పనులకు టెండర్లు ఓపెన్ కావడం జరుగుతుందని తెలిపారు. ఓల్డ్ టౌన్ ప్రాంతంలోని అన్ని వార్డులలో అంతర్గత రోడ్లను నిర్మించామని, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. నంద్యాలను మోడల్ టౌన్‌గా మారుస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. రానున్న 3నెలల్లో నంద్యాల పట్టణంలోని వార్డుల వారీగా తాము ఎంత మేర అభివృద్ధి చేశామో తెలియజేస్తామన్నారు. నంద్యాలను ఎంపీ, ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్పర్సన్‌ల సమిష్టి సహకారంతో మరింత అభివృద్ధి చేపడుతామన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్ పామ్ షావలి, కౌన్సిలర్స్ సాదిక్ బాష, కలం బాష, ఆరిఫ్ నాయక్, తబ్రేజ్, కోఆప్షన్ సభ్యులు సలాం ముల్లా, పడగండ్ల సుబ్రహ్మణ్యం, మాజీ కౌన్సిలర్ మునయ్య, నాగరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కాటసాని




సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ఏరియా, ఎన్జీవోస్ కాలనీలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని, తనను ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, ఆర్డబ్ల్యూఎస్సి సాయి కృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ మహేష్, విద్యుత్ శ్రీనివాసులు, ఎంఈఓ స్వరూప, వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, పంచా యతీ యువ ఖలీల్ జడ్పిటిసి సభ్య రాలు సుబ్బలక్ష్మమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గరుడ దీవెనమ్మ, వైసీపీ నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, గౌండ నాగరాజు, సాదుల శివశంకర్ రెడ్డి, దేవుడు గౌడ్, కుమ్మరి సురేష్, కిషోర్ కుమార్, బాలు, నారాయణ, గౌండ కంబగిరి పాల్గొన్నారు.

నంద్యాలలో ఫ్లెక్సీల రగడ..

- ఎస్‌పికి ఫిర్యాదు చేసిన టిడిపి శ్రేణులు



జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రశాంతంగా ఉన్న నంద్యాలలో ఫ్లెక్సీల రగడ రాజుకుంటోంది.. వైసిపికి చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు అనవసరమైన ఫ్లెక్సీలు కడుతూ కులమతాల మధ్య చిచ్చు పెట్టె ప్రయత్నం చేస్తున్నారని టిడిపి శ్రేణులు ఆరోపిస్తున్నాయి. గురువారం జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డిని టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి 'టిడిపి, బిజెపి, వైసిపి ఒకటే' అనే పేరుతో ఫ్లెక్సీలు కట్టిన వారిపై, కట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. నంద్యాలలో మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఫ్లెక్సీలు పోస్టర్లు పెట్టించిన వైసిపిపై, ఎమ్మెల్యే శిల్పా రవి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డిపై నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డికి, డిఎస్పి మహేశ్వర రెడ్డికి, అన్ని పోలీసు స్టేషన్లలో టిడిపి పట్టణ కార్యదర్శి ఎన్ఎండి షాకిర్ ఆధ్వర్యంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు గోవింద్ నాయుడు, మిద్దె హుస్సేనీ, న్యాయవాదులు సాయిరాం, ప్రసాద్ రెడ్డి, విజయ గౌరీ, జనసేన నాయకులు విశ్వనాథ్‌లు మాట్లాడుతూ నంద్యాలలో కులమతాల మధ్య చిచ్చు కుంపటి పెడుతూ రోజురోజుకు శిల్పా మోహన్ రెడ్డి దిగజారుడు రాజకీయం చేస్తున్నారని అన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన నంద్యాలలో మొన్న ఇండియా-పాకిస్థాన్ అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసి, అవి చల్లారాక ముందే మళ్ళీ వివాదాస్పద ఫ్లెక్సీలు, పోస్టర్లు పెట్టించడం వెనుక కుట్ర దాగుందన్నారు. మత రాజకీయాలు నంద్యాలలో చెల్లవని, కొండ సుంకేసులకు వెళ్లి చేసుకోవాలని హితవు పలికారు. ఇంకోసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం అయితే శిల్పా ఇంటిని సైతం ముట్టడికైనా సిద్ధమేనని హెచ్చరించారు. తన ప్రత్యర్థి ముస్లిం మైనారిటీకి చెందిన వాడు కాబట్టి, ఇలాంటి సంస్కృతిని శిల్పా మోహన్ రెడ్డి, శిల్పా రవి ఆజ్యం పోస్తున్నారని, ఫరూక్ హుందా రాజకీయం ముందు ఇవన్నీ చెల్లని చీటీలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగార్జున, జైనాబ్ బీ, తాటికొండ బుగ్గరాముడు, పిడతల సుధాకర్, దూదేకుల దస్తగిరి, ఉప్పరి సురేష్, ఉప్పరి సుబ్రహ్మణ్యం, కామిని మల్లికార్జున, కొమ్ము హరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి

'రా కదిలి రా' బహిరంగ సభ విజయవంతం

- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

ఆళ్లగడ్డలో జరిగిన రా కదిలి రా బహిరంగ సభ విజయవంతం అయిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోనికి వస్తే బనగానపల్లె నియోజకవర్గంలోని పెద్దవేంతర్ల ఎత్తిపోతల పథకం, జోలద రాశి రిజర్వాయర్, బనగానపల్లె బైపాస్ రోడ్, కోవెలకుంట్ల బైపాస్ రోడ్ పూర్తి చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వంలో కుదేలైన నాపరాయి పరిశ్రమను ఆదుకుంటా మని చంద్రబాబు ప్రకటన చేశారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బనగానపల్లె నియోజకవర్గన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తే, వైకాపా వచ్చాక వినాశనం చేసిందని బీసీ ఆరోపించారు. వైసిపి పాలన నుండి రాష్ట్రాన్ని కాపాడాలని, టిడిపి పాలనతోనే రాష్ట్రానికి స్వర్ణ యుగం వస్తుందని బీసీ స్పష్టం చేశారు.

టిడిపి నుండి వైసిపిలోకి చేరిక

ప్రజాశక్తి - ప్యాపిలి

మండలంలోని యస్.రంగాపురం గ్రామంలో టిడిపికి చెందిన 10 కుటుంబాలు ఆ పార్టీని వీడి జడ్పిటిసి శ్రీరామ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, గజేంద్ర, భువనేశ్వర రెడ్డి సమక్షంలో వైసిపిలో గురువారం చేరారు. పార్టీలో చేరిన మారమేసి నాగన్న, జనార్ధన్, రాముడు, పెద్ద పెద్దయ్య, చిన్న పెద్దయ్య, నాగేశ్వర రావు, గుర్రప్ప, బాలరాజు, రాముడు తదితరులకు వారు వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గార్లదిన్నె రామ సుబ్బయ్య, చంద్రశేఖర్ రెడ్డి, రామూర్తి, జయరామయ్య, బాలరంగయ్య, నాగరాజు, బాలాంజీ, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నుంచి వైసీపీ పార్టీ లోకి చేరిన రంగాపురం గ్రామస్తులు



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న రూరల్ సీఐ

తమ్మడపల్లెలో చోరీ

- ఆరు తులాల బంగారం, మూడు లక్షల నగదు చోరీ

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని తమ్మడపల్లె గ్రామానికి చెందిన దూదేకుల సోమన్న అనే వ్యక్తి ఇంట్లో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి మత్తుమందు ఇచ్చి ఆరు తులాల బంగారం, మూడు లక్షల నగదు, ఒక చరవాణి దొంగిలించుకుపోయారని ఆ ఇంటి యజమాని తెలిపారు. గురువారం ఉదయం దొంగతనం గురించి మహానంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఘటన స్థలానికి నంద్యాల రూరల్ సీఐ శివకుమార్ రెడ్డి, మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఘటన స్థలానికి చేరుకొని, దొంగతనం జరిగిన ప్రదేశాలు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ సోమన్న అనే వ్యక్తి ఇంట్లో ఆరు తులాల బంగారం, మూడు లక్షల నగదు, ఒక చరవాణి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఎపి రజక వృత్తిదారుల సంఘం 2024 క్యాలెండర్‌ను గురువారం ఆత్మకూరు పట్టణంలోని రజక వీధిలో సంఘం జిల్లా కన్వీనర్ చందా వారి వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి బావాపురం శ్రీరాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రజకులకు సామాజిక భద్రత లేదని, రజకుల పట్ల దాడులు, మహిళలు, బాలికలపై అత్యాచారాలు నేటికీ కొనసాగుతున్నాయని అన్నారు. వీటిని అరికట్టేందుకు రజక సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్ద వెంకట సుబ్బయ్య, సుంకన్న, బావాపురం శ్రీనివాసులు, బావాపురం శ్రీరాములు, సురేష్, రాము, సుబ్బారాయుడు, శీను, సుబ్బయ్య, వంశీ, పవన్ తదితరులుపాల్గొన్నారు.



క్యాలెండర్ను ఆవిష్కరిస్తున్న రజక సంఘం నాయకులు

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



బేతంచర్ల : చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న నేతలు



నంద్యాల రూరల్ వడ్డెర ఓబన్న చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న వడ్డెర సంఘనాయకులు

ప్రజాశక్తి - బేతంచర్ల

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను బేతంచెర్ల పట్టణ కేంద్రంలోని వడ్డెర సంఘం కార్యాలయం నందు వడ్డెర సంఘం మండల నాయకులు దేసింగు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో గురువారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లంక సుబ్బ రాయుడు, మండల నాయకుడు మొక్కల సుబ్బరాయుడు లాలప్ప తదితరులు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ వారి పరిపాలనలో ఎదిరించి పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైనిక అధ్యక్షుడిగా వడ్డెర ఓబన్న ఎంతో నమ్మకంగా ఉండి స్వాతంత్ర పోరాటంలో కీలకపాత్ర వహించారని అన్నారు. ఆయన స్ఫూర్తితోనే వడ్డెరలను రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చే అంతవరకు సమిష్టి కృషితో ఉద్యమించాలని వారు అన్నారు. **నంద్యాల రూరల్ :** నంద్యాల వడ్డే ఓబన్న సేవలను గుర్తించి విగ్రహానికి నంద్యాల జిల్లాలో ఐదు సెంట్ల స్థలం ఇచ్చి విగ్రహాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి వడ్డే ఓబన్న సేవా సమితి శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు చల్లా వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భక్తుల లక్ష్మీకాంతయ్య ఆదేశాల మేరకు నంద్యాలలోని వడ్డెర సంఘం కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా వెంకటేష్ మాట్లాడుతూ వడ్డెరలు ఎస్టీ జాబితాలో ఉన్న వారిని బిసి ఏలో చేర్చడం వల్ల తీరని న్యాయం జరిగిందన్నారు. వడ్డెరలను ఎస్టీలో చేర్చిన పార్టీలకే మద్దతు తెలుపుతామని అన్నారు.

నందికొట్కూరు : అఖిలభారత వడ్డె ఓబన్న సేవా సమితి ఆధ్వర్యంలో వడ్డెర ఓబన్న 217వ జయంతి వేడుకలను గురువారం స్థానిక కొత్త బస్టాండ్ నుండి పటేల్ సెంటర్ వరకు ర్యాలీగా నిర్వహించి, బాణసంచా కాల్చి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డె శివమణి, తాలూకా అధ్యక్షుడు నడిపి వెంకటేశ్వర్లు హాజరై వడ్డెర ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెర ఓబన్న బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన నాయకులలో ఒకరని తెలిపారు. కార్యక్రమంలో బివిఎన్ రాజు, సంపంగి శివకృష్ణ, ఆర్ మల్లికార్జున, కొంచెపు చిన్న, వల్లేపు శివకృష్ణ, కేతన సురేష్, దండగుల రాఘవేంద్ర, దండగుల మధు, శ్రీనివాసులు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరు : వడ్డెర ఓబన్న చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

16 నుండి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని చిన్న కంబ లూరు గ్రామంలో ఈనెల 16వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జిల్లాస్థాయి కబడ్డీ పోటీ నిర్వహిస్తున్నట్లు యూత్ అమాలి బాయ్స్ యూనియన్ నాయకులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 20వేలు, రెండో బహుమతి రూ. 15 వేలు, మూడో బహుమతి రూ.10,000, నాలుగో బహుమతి రూ. 5000 ప్రకారము గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 15వ తేదీ సాయంత్రంలోపు ఎంట్రీ ఫీజు రూ. 500 చెల్లించి తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పించడం జరిగిందన్నారు. వివరాలకు 83414423, 7780603900 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణం గురు రాజా పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం సంక్రాంతి పండుగ పర్వదినం పురస్కరించుకొని పాఠశాలలో ఉన్నటువంటి మహిళ ఉపాధ్యాయులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురురాజా విద్యా సంస్థ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి వచ్చేసి ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచినటువంటి మహిళల ల ఉపాధ్యాయునిలకు ఆకర్షణీయమైన బహుమతులు గురురాజా విద్య సంస్థ కరస్పాండెంట్ పద్మావతి రెడ్డి చేతుల మీదుగా మహిళా ఉపాధ్యాయులకు బహుమతి ప్రధానం చేస్తూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు, ఇన్చార్జులు, పాఠశాల మహిళ ఉపాధ్యాయినీలు పాల్గొని ముగ్గుల పోటీలను విజయవంతం చేశారు.



ముఖ్యఅతిథిగా గురు రాజా స్కూల్ కరెస్పాండెంట్ పద్మావతి రెడ్డి విజేతలకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం



నంద్యాల కలెక్టరేట్ : మాట్లాడుతున్న ప్రజాశక్తి ఎడిషన్ ఇంచార్జ్ పానుగంటి చంద్రయ్య



నందికొట్కూరు టౌన్ : నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం

5వ పేజీ తరువాయి..ఇచ్చేందుకు ఇది వేదిక కాదని, తమ ఇండ్ల వద్దకు వచ్చి ఇవ్వాలని, అంతవరకు తీసుకునేది లేదని తేల్చి చెప్పడంతో వారు వెనుతిరిగి వెళ్లిపోయారు. **కొత్తపల్లి :** కొత్తపల్లి తాసిల్దార్ కార్యాలయం ముందు ఎస్మా చట్టం ప్రతులను అంగన్‌వాడీలు దహనం చేసి నిరసన తెలిపారు. పోస్ట్ ద్వారా అధికారులు పంపిన నోటీసులను అంగన్వాడీలు తిరిగి వెనక్కి పంపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు హరిత, మండల నాయకురాలు నాగమణి, శ్రీదేవి, రమణమ్మ, అంగన్వాడీలు రమణమ్మ, నాగమణి, వసంత, విజయమ్మ, సునీత, లింగపులమ్మ, కృష్ణవేణి, శ్యామలమ్మ, ప్రసన్న, లైసమ్మ, జయమ్మ పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడు మండల కేంద్రంలో 31వ రోజు అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, రవణమ్మబాయ్, శ్రీలత, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలో అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వ్యకాస జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, మండల కార్యదర్శి నాగన్న, వ్యకాస జిల్లా నాయకులు పి. ఫకీర్ సాహెబ్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకురాలు మదార్ బి మాట్లాడారు. అంగన్‌వాడీ నాయకురాళ్లుశైలజ, ఉమాదేవి, వెంకటలక్ష్మి, రజియా, చంద్రకళ, శ్రీలక్ష్మి, పుష్పలత, కీర్తి పాల్గొన్నారు. అలాగే జూపాడు బంగ్లా మండల కేంద్రంలోని తహశీల్దార్ ఆఫీస్ వద్ద అంగన్‌వాడీలు పొర్లు దండాలు పెడుతూ నిరసన చేపట్టారు. అంగన్‌వాడీ నాయకురాలు లక్ష్మీదేవి, లలితమ్మ, శ్రీదేవి, వ్యకాసం జిల్లా నాయకులు ఎం.కర్ణ, అంగన్వాడీలు పాల్గొన్నారు. **వెలుగోడు :** వెలుగోడు తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రామదాసు, సిఐటియు మండలం అధ్యక్షులు వి నాగమోహన్, అంగన్వాడి సెక్టార్ నాయకురాలు భాగ్యలక్ష్మి, రవణమ్మ, తులసమ్మ, శశికళ, రామ తులసమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ సీటు నాకే

- మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆళ్లగడ్డ అసెంబ్లీ సీటు తనకేనని, గెలిచి చంద్రబాబు నాయుడుకు కానుకగా ఇస్తామని టీడీపీ నాయకురాలు మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ ప్రకటించారు. గురువారం నంద్యాల జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భూమా అఖిల ప్రియ మాట్లాడారు. ఆళ్లగడ్డ సీటు తనకేనని చంద్రబాబు నాయుడు చెప్పినట్లు ఆమె పేర్కొన్నారు. నంద్యాల టికెట్ ఎవ్వరికిచ్చినా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకునేందుకు పార్టీ గెలుపు కోసం పని చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ సారి ఎలాగైనా చంద్రబాబును సీఎంగా చేయాలన్నదే లక్ష్యంగా అహర్నిశలు కష్టపడి పని చేస్తామన్నారు. ఈ నెల 9న ఆళ్లగడ్డలో జరిగిన రా టిడిపి పిలుస్తుంది రా కదిలి రా బహిరంగ సభకు దాదాపు 70 వేల మంది వచ్చారని, సభ విజయవంతం కావడానికి కృషి చేసిన పార్టీ రాష్ట్ర,జిల్లా నాయకులకు కార్యకర్తలకు, అభిమానులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నాయుడును స్వచ్ఛందంగా చూడటానికి కదలి వచ్చారని ఆమె తెలిపారు. 25 యేళ్లలో ఇంత జనం రావడం ఇదే తొలిసారి అని అన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ

'ముస్లింల పురోగతి ఎప్పుడు, ఎలా'ను విజయవంతం చేయండి

- షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ ఖైర్

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

ఈనెల 12వ తేదీన బనగానపల్లె పట్టణంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ నందు ముస్లింల పురోగతి ఎప్పుడు, ఎలా అనే అంశంపై బిఆర్ సిరాజ్ ఉర్ రహేమాన్ ప్రసంగం ఉంటుందని ఈ కార్యక్రమమును విజయవంతం చేయాలని షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ ఖైర్ తెలిపారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్, ప్రముఖ న్యాయవాది కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముస్లిమ్స్ పెద్దలు 'ముస్లిమ్స్‌ల పురోగతి ఎప్పుడు ఎలా' కార్యక్రమ గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నేటి సమాజంలో ముస్లిం యువత ఉద్యోగాలు లేక ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. మహమ్మద్ ప్రవక్త నడిచిన బాటలో మనం నడవాలని ఈ కార్యక్రమం ఎలాంటి రాజకీయపరంగా కాకుండా కుల మతాలకు అతీతంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిరాజ్ రెహ్మాన్ ప్రసంగం చేయడం అదృష్టం అన్నారు. సమాజంలో అందరితో ఎలా కలిసిమెలిసి మమేకంగా ఎలా ప్రవర్తించాలి అనే అంశములపై ప్రసంగం జరుగుతుందని ముస్లింలు వెనుకబడిన, ముస్లింలు ఒకరికొకరు కలయికగా లేనందున ప్రతి ముస్లిం సోదరులు అన్నదమ్ములు లాగా కలిసిమెలిసి ఉండాలని కార్యక్రమం ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ఎపి మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహీద్ హుస్సేన్, సైకిల్ షాప్ మహబూబ్ వలి, చక్రవర్తి సాదక్, సంఘం హెూటల్ హైదర్, పాన్ బిడావళి తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నేతలు

శరవేగంగా సీసీ రోడ్డు పనులు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండల కేంద్రమైన చాగలమర్రి మేజర్ గ్రామపంచాయితీలో ఉన్న 5 సచివాలయాల పరిధిలో సుమారు రూ.1.50 కోట్ల జీజీఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. స్థానిక చిన్నమకానం వీధిలో లాల్స్వామి మకానం నుండి దత్తాత్రేయ ఇంటి వరకు, చింతలచెరువు రస్తాలో దూదేకూల మస్తానమ్మ నుండి దూదేకుల రసూల్ ఇంటి వరకు, కూలూరు రస్తాలో రెండు వీధులలోని 4 సీసీరోడ్లు, డ్రైనేజీలు రోడ్లు, కోటగడ్డ వీధిలో దస్తగిరి ఇంటి నుండి దోడియం సుబ్రమణ్యాం ఇంటి వరకు, సయ్యద్భాష ఇంటి నుండి గుర్రం సరోజమ్మ ఇంటి వరకు, 2వ సచివాలయం పరిధిలోని గాడి ఆక్తరున్ ఇంటి వద్ద నుండి సయ్యద్ ఆసీఫ్ ఇంటి వరకు సిసి రోడ్డు, గుంతపాళెం వీధిలో చిన్న భికారి ఇంటి నుండి షరీఫ్ ఇంటి వరకు, మహబూబ్ పీరా ఇంటి వద్ద నుండి మహమ్మద్స్ ఇంటి వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తయ్యాయి. కోటగడ్డ వీధిలో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ముల్లా షేక్షావల్లి, 4వ సచివాలయ కన్వీనర్ పి. మహబూబ్ బాష, వార్డు సభ్యుడు ముల్లా గౌస్పర్, కంట్రాక్టర్ ఎ. హుసేన్ వలి, నాయకులు నాయబ్రసూల్, మున్నా, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలోని పిక్కిళ్లపల్లి తండా గ్రామ పరిసర ప్రాంతాల్లో నాటు సారా బట్టీలపై జిల్లా ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకట రాముడు పర్యవేక్షణలో సారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు బట్టీలపై దాడులు చేశారు. తయారీదారులు పారిపోగా అక్కడ ఉన్న 10 లీటర్ల సారాయిని, 900 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. అనంతరం అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా సారాను తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సారా కేసుల్లో పలుమార్లు పట్టుబడిన వారికి పీడి యాక్టు కూడా నమోదు అవుతుందని తెలిపారు. ఈ దాడుల్లో బనగానపల్లె ఎన్ఫోర్స్మెంట్ అధికారి దౌలత్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.



సారా బట్టిలపై దాడులు చేస్తున్న ఎన్ఫోర్స్మెంట్ అధికారులు

జిందాల్ లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - గడివేముల

గడివేములలోరని సినిమా థియేటర్ సమీపాన జిందాల్ లారీ ఢీకొట్టడంతో టైరు కింద పడి మహిళ మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మిడుతూరు మండలం చెరుకు చెర్ల గ్రామానికి చెందిన తంబలి కస్తూరయ్యా, భార్య పద్మావతమ్మ, మనవరాలు త్రిపురతో కలిసి టీవీఎస్ మోటార్ సైకిల్‌పై మహానందికి వెళుతుండగా గడివేముల సినిమా థియేటర్ సమీపాన వెనుక వస్తున్న జిందాల్ లారీ అతివేగంగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో పద్మావతమ్మ (55) అక్కడికక్కడే మృతి చెందింది. తంబలి కస్తూరయ్యకు, మనవరాలు త్రిపురకు స్వల్ప గాయాలయ్యాయి. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



మృతి చెందిన మహిళ

ఎన్నికల నిర్వహణకు అప్రమత్తం

-డోన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - బెతంచెర్ల

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల అప్రమత్తంగా ఉండాలని డోన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి డోన్ సబ్ డివిజన్లోని సిఐలు, ఎస్ఐలను ఆదేశించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ నందు నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను నివారించేందుకు తీసుకోవలసిన పలు చర్యలను సూచించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ప్రత్యేకంగా నిఘా ఉంచాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో గ్రామాల్లో బసచేస్తూ అన్ని రకాలుగా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సీఐ ప్రియతమ రెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్, డోన్ సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ నాయకుడు మృతి

- నివాళులర్పించిన బీసీ ఇందిరా

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని దొరకోట లో అనారోగ్యంతో ముస్లిం మైనార్టీ నాయకులు సియా ముస్తఫా (70) గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



ముస్లిం మైనార్టీ నాయకుడు మతదేహానికి నివాళులర్పిస్తున్న బీసీ ఇందిరా

వరి గడ్డి దగ్ధం

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని యు. బొల్లవరం గ్రామంలో రైతు నాగరాజుకు చెందిన వరిగడ్డి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గురువారం దగ్ధమైంది. పశువుల మేత కోసం గడ్డిని ఉంచగా దానికి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైందని, సుమారు. రూ. 25 వేల నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

చెంచుల సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - రుద్రవరం

చెంచుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో మధుసూదనరెడ్డి తెలిపారు. మండలంలోని హరినగరం చెంచుగూడెంలో ఎంపీడీవో మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో పీఎం జన్మన్ (ప్రధానమంత్రి జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్)కు సంబంధించి గురువారం చెంచులతో గ్రామ సభ నిర్వహించారు. ఇందులో భాగంగా కనీస అవసరాలు మౌలిక సదుపాయాల గురి౦చి ఎంపీడీవో చెంచులను అడిగి తెలుసుకున్నారు. కనీస అవసరాలు లేనివారిని గుర్తించి వారి సమస్యలను పరిష్కరించామని ఇతర శాఖలకు సంబంధించిన అధికా రులను వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని మండల అధికారులను సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సవరం కమల వైసీపీ నాయకుడు సవరం నాగముని, ఎన్ ఆర్ జి ఎస్ ఏపీవో ప్రతాప్, వీఆర్వో ఓబులేసు, పంచాయతీ కార్యదర్శులు ఆదిలక్ష్మి, శివకృష్ణ, సచివాలయం సిబ్బంది, వెలుగు సిసి, ఫీల్డ్ అసిస్టెంట్ వాలంటీర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

టిడిపితోనే జొలదరాశి రిజ్వాయర్ సాధ్యం

- మాజీ ఎమ్మెల్యే బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపితోనే జోలదరాశి రిజర్వాయర్ సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గంలోని కోవెలకుంట్ల మండలం లింగాల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బీసీ ఇంటింటికి వెళ్లి వైసిపి వైఫల్యాలను ఎండగడుతూ, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ కుందూ నది రిజర్వాయర్ శంకుస్థాపన చేసిన 16 నెలల్లో కడతామని ప్రగల్బాలు పలికిన వైసీపీ నాయకులు 3 సంవత్సరాలు అయినా ఇప్పటివరకు కనీసం ఒక ఇటుక ముక్క కట్టిన పాపానా పోలేదని విమర్శించారు. సైకో ముఖ్యమంత్రి జగన్ పాలనలో దేశానికే అన్నం పెట్టిన అన్నపూర్ణలాంటి ఆంధ్రప్రదేశ్‌లో ఆకలి కేకలు వినపడుతు న్నాయని తెలిపారు. కుందూ నది వైండింగ్ పనులు ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయి నాయని,కుందూ నదిని, ఎస్సార్ బీసీ నీళ్లతో పారించిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని తెలిపారు. లింగాల గ్రామంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ. 258 లక్షలతో అభివృద్ధి పనులు, రూ. 62 లక్షల రుణమాఫీ చేసామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

అంబేద్కర్ మార్గంలో నడుస్తాం : వైసిపి

ప్రజాశక్తి - పాములపాడు

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఆయన చూపిన మార్గంలో నడుస్తామని తుమ్మలూరు సర్పంచి వరప్రసాదరావు, వైసిపి మండల కార్యదర్శి నాయిని మధుసూదన్ రావు, నాయకులు ఉపేంద్ర, జనార్ధన్, శ్రీనివాసాచారి, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య కళ్యాణ్ అన్నారు. సామాజిక సమతా సంకల్పంలో భాగంగా గురువారం మండలంలోని జూటూరు, తుమ్మలూరు గ్రామల సచివాలయాల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తామని సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ సంతకాలు చేయడం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



జూటూరు గ్రామంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైసీపీ మండల కార్యదర్శి మధుసూదన్ రావు నాయకులు

క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలి : వైసిపి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులు క్రీడలు ఆడుతున్న సమయంలో క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలని వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం కొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా వ్యాయామ ఉపాధ్యాయులు మురళి నాయక్ ఆధ్వర్యంలో రెండవ రోజు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఎదురుపాడు, దుద్యాల జట్లు తలపడగా ఎదురుపాడు జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుని నందికొట్కూరు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. వైసిపి నాయకులు నారాయణరెడ్డి, రహంతుల్లా, శ్రీనివాసులు యాదవ్, నాగ ఎల్లయ్య, లింగారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, స్వప్న, రీనా, సుంకన్న, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మండల కన్వీనర్

అహోబిలంలో తిరుమంజనం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహెూబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గురువారం హనుమాన్ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి,భూదేవి అమ్మవార్లును ఆలయం ఎదురుగా ఉన్న బీగాల ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలా చార్యులు, అర్చక బందం ప్రహ్లాద వరదులకు, ఆంజనేయ స్వామికి నవ కలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.



తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం